
సమావేశంలో మాట్లాడుతున్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

## జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

### మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, జూలై 28 : సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించడంతో పాటు జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా వరంగల్ ప్రెస్‌క్లబ్‌కు వచ్చిన ఆయనను గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో సన్మానించారు. జర్నలిస్టు నాయకులు సమస్యలను మీడియా చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా మూడు దశాబ్దాలుగా వరంగల్ జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలు, జర్నలిస్టులకు అక్రిడేషన్స్‌తో పాటు హెల్త్‌కార్డులు అందజేసేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు. చాలాచోట్ల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానన్నారు. ఇళ్ల స్థలాల విషయమై త్వరలోనే స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల సహకారంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య పాల్గొన్నారు.

## రామప్ప కాలువ గండ్లకు మరమ్మతు



కాలువ కట్టను మరమ్మతు చేస్తున్న కూలీలు

వెంకటాపూర్, జూలై 28 : మండలంలోని రామప్ప చెరువు ఒగరు కాలువకు గండ్లు పడగా శనివారం రామప్ప కాలువలకు గండ్లు శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు నీటి పారుదల శాఖ డీఈ రవీందర్ ఆధ్వర్యంలో ఆదివారం గండ్లను పూడ్చివేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రామప్ప చెరువు కింద రామంజాపూర్ గ్రామ పరిధిలోని గుంటూరుపల్లి శివారులో గండ్లు పడ్డాయి. దీంతో వాటిని పూడ్చాలని రైతులు వేడుకోగా అధికారులు ఆదివారం గండ్లు పడిన ప్రదేశానికి పరిశీలించారు. జేసీబీలు వెళ్లలేని పరిస్థితి ఉండడంతో డీఈ రవీందర్ స్థానిక రైతులు, కూలీలతో గండ్లలో రాళ్లు, మట్టి, ఇసుక బస్తాలను నింపి, గండ్లు పూడ్చివేయించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## 'వరల్డ్ హెరిటేజ్ వలంటీర్'కు దరఖాస్తులు

వెంకటాపూర్, జూలై 28: ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప దేవాలయ ప్రాంగణంలో కాకతీయ హెరిటేజ్ ఆధ్వర్యంలో అక్టోబర్‌లో నిర్వహించనున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ క్యాంపెయిన్‌కు యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేంద్ర పురావస్తుశాఖ, తెలంగాణ టూరిజం, ఇంటాక్, ఐకోమస్ ఇండియా సహకారంతో వలంటీర్ క్యాంపెయిన్‌ను 'వర్కింగ్ ఆన్ ద ఫ్యూచర్' అనే థీమ్‌తో నిర్వహించనున్నారు. చరిత్ర, కళలు, అర్కియాలజీ, అర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరింగ్, జియాలజీ బ్యాక్‌గ్రౌండ్‌తో డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏండ్లలోపు వారు అర్హులు. www. kakatiyaheritagetrust.orgలో కానీ, https;// whc.unesco. org/en/volunteers 2024 యునెస్కో వెబ్‌సైట్‌లో కానీ దరఖాస్తు చేసుకోవాలి. చివరి తేదీ ఆగస్టు 15 కాగా, ఆగస్టు 20న 40 మందిని ఎంపిక చేస్తారు. వీరిలో విదేశీయులు 10, స్వదేశం నుంచి 30 మందిని ఎంపిక చేస్తారు. వివరాలకు పాండురంగారావు నంబర్ 9989537268, ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు నంబర్ 9441280606ను సంప్రదించవచ్చు.

## రామప్పను సందర్శించిన పాన్ ఇండియా గైడ్స్

వెంకటాపూర్, జూలై 28 : పాలంపేట గ్రామంలోని రామ ప్ప దేవాలయాన్ని పాన్ ఇండి యా టూర్ గైడ్స్ జయచంద్రన్, జయరాజ్, అజయ్ కు మార్, అరుణ్ కుమార్, అలెక్స్, జోజన్, జిషోయి, సుకంద, నల్గొండ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ దంపతులు సందర్శించారు. వారికి అర్చకులు హరిశ్‌శర్మ, ఉమాశంకర్ స్వాగతం పలికారు. అనంతరం పర్యాటకు రామప్ప చెరువును సందర్శించారు. వారి వెంట ఇండియా టూరిజం గైడ్ నాగసుబ్రమణ్యం, టూరిజం సిబ్బంది ఉన్నారు. కాగా, ఆదివారం కావడంతో రామప్ప పర్యాటకులు, విద్యార్థులతో సందడిగా మారింది. వర్షం వల్ల బోటింగ్ బంద్ కావడంతో పర్యాటకులు నిరాశతో వెనుదిరిగారు.

## కుక్కల దాడిలో గాయపడిన వృద్ధురాలు మృతి

టేకుమట్ల, జూలై 28 : మండలంలోని రామకృష్ణాపూర్(వి) గ్రామానికి చెందిన ఆకునూరి చంద్రమ్మ(80) 15 రోజుల క్రితం కుక్కల దాడిలో గాయపడి ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. ఇంట్లో పడుకున్న వృద్ధురాలిని కుక్క లు తల భాగం పీక్కుతినడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించారు. అప్పటి నుండి చికిత్స పొం దుతున్న చంద్రమ్మ శనివారం రాత్రి మృతి చెందింది. ఇప్పటికైనా కుక్కల బెడద నుంచి తమను అధికారులు కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అప్పలబాధతో కౌలు రైతు ఆత్మహత్య


రామిరెడ్డి (ఫైల్)

బూర్గంపాడు, జూలై 28: అప్పుల బాధ తాళలేక, వాటిని తీర్చే మార్గం కనిపించక ఓ యువ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం భద్రాద్రి జిల్లా బూర్గంపహాడ్ మండలం మోరంపల్లి బంజర గ్రామంలో చోటుచేసుకుంది. బంజర గ్రామానికి చెందిన నలుగూరి రామిరెడ్డి (35) రెండేండ్ల క్రితం రూ.12 లక్షలతో గ్రామంలో ఎకరం పొలాన్ని కొనుగోలు చేశాడు. అందుకు కొంత అప్పు తెచ్చాడు. దానికితోడు ఆ పొలం పక్కనే మరో మూడు ఎకరాలను కౌలుకు తీసుకున్నాడు. ఆ మొత్తం పొలంలో వరి పంటను సాగుచేస్తున్నాడు. పొలం కొనుగోలు చేసినందుకు అయిన అప్పుతోపాటు కౌలుకు తీసుకున్న పొలంలో పంటను సాగు చేసేందుకు కూడా మరికొంత అప్పు చేశాడు. ఆర్థిక సమస్యల కారణంగా కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో అప్పుల బాధలు ఎక్కువై మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం తన భార్య వరలక్ష్మి వరి నాట్లు వేసేందుకు వెళ్లిన తర్వాత ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లి వివరాలు సేకరించారు. అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకున్నట్టు కుటుంబీకులు తెలిపారు.

## నజీర్ ఇంటికి కరెంట్ కనెక్షన్ పునరుద్ధరణ

### 'నమస్తే తెలంగాణ' కథనానికి ట్రాన్స్‌కో అధికారుల స్పందన

సూర్యాపేట, జూలై 28 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట పట్టణంలోని నిర్మలా దవాఖాన వద్ద నివాసముంటున్న దివ్యాంగుడు నజీర్ ఇంటికి విద్యుత్తు అధికారులు కనెక్షన్‌ను పునరుద్ధరించారు. నజీర్ ఇంటికి అధిక కరెంట్ బిల్లు రావడంతో ఆయన మొత్తం కట్టలేదు. దాంతో సిబ్బంది కనెక్షన్‌ను తొలగించారు. ఈ ఘటనపై ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో 'గృహజ్యోతికి గ్రహణం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ఉదయం నజీర్ ఇంటికి వచ్చి వివరాలు తెలుసుకొని వెంటనే కరెంట్ కనెక్షన్ ఇచ్చారు. 24 గంటల్లోపే తన సమస్య పరిష్కారమవడంతో నజీర్ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను వెలుగులోకి తెచ్చిన నమస్తే తెలంగాణ పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయమై ఆదివారం సూర్యాపేటలోని ఎస్ఈ ఆఫీసులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఈ పాల్‌రాజ్ మాట్లాడుతూ.. 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్తు వినియోగిస్తేనే బిల్లు వస్తుందని, లేకుంటే జీరో బిల్లు వస్తుందని తెలిపారు. బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. నజీర్ 2023 డిసెంబర్ నుంచి బిల్లులు చెల్లించడం లేదని, దాంతో ఆయన బిల్లు ఎక్కువగా ఉందని, కొంత కొంత చెల్లిస్తున్నాడని తెలిపారు.

## సంగ్రహాలయంలో అపురూప జైన శిల్పాలు

హైదరాబాద్, జూలై 28(నమస్తే తెలంగాణ) : కొలనుపాకలోని ప్రసిద్ధ జైన దేవాలయ ప్రాంగణంలో ఉన్న జైనశిల్ప సంగ్రహాలయంలో వందలోపు శిల్పాలు, శాసనాలు ఉన్నాయని, ఇవి ఎంతో అపురూపమైనవని కొత్త తెలంగాణ చరిత్ర బృందం తెలిపింది. వీటిలో జైనముఖి స్తంభాలు, జైన స్తూప ప్రతిమ, యక్షిణులు, గురువులు, తీర్థంకరులు, బాహుబలి విగ్రహాలు ముఖ్యమైనవని పేర్కొన్నది. సంగ్రహాలయం బయట కనిపించిన ఓ రాతిస్తంభంపై జైన మహావీరుడు, వ్యాస పీఠానికి ఎదురుగా వ్యాఖ్యాన ముద్రలో కూర్చున్న జైన గురువు ప్రతిమలు ఉన్నాయని, శాసనాల్లోని లిపిని బట్టి ఇవి కల్యాణి చాళుక్యుల కాలం (10,11వ శతాబ్దాలు) నాటివని తెలుస్తున్నదని బృందం సభ్యులు వెల్లడించారు. ఇలాంటి శిల్పాలు హన్మకొండ పద్మాక్షిగుట్టతోపాటు రాయచూరులో ఉన్నాయని, అప్పట్లో విద్య, వైద్యం అందరికీ ఉచితంగా అందించినట్టు శాసనాలు, జైన సాహిత్యం ద్వారా తెలుస్తున్నదని, శాసనాల ద్వారా లభించిన ఆధారంగా కొలనుపాక కూడా జైన విద్యా కేంద్రం అయ్యుండొచ్చని వారు అభిప్రాయపడ్డారు.


కొలనుపాక జైన దేవాలయ ప్రాంగణంలో కల్యాణి చాళుక్యుల నాటి జైనశిల్పాలు

# ప్రజా సేవలో పోలీసులు

- మహబూబాబాద్‌ను 'మత్తు' రహిత జిల్లాగా మార్చాలి
- ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్
- అంధుడు నాగన్నకు దాతల సహకారంతో ఇల్లు కట్టించి ఇచ్చిన ఎస్సై సతీశ్‌కు అభినందన


అంధుడు నాగన్న ఇంటిని ప్రారంభిస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

నర్సింహులపేట, జూలై 28: ఆపదలో ఉన్న ప్రజలకు సేవ చేయడంలో పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని మహబూబాబాద్ ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అన్నారు. మండలంలోని పెద్దనాగారానికి చెందిన అంధుడు మందుల నాగన్న పేద కుటుంబం కావడంతో పూటగడువక పాటలు పాడు తూ జీవన సాగిస్తున్నాడు. ఇల్లు లేకపోవడంతో పూరి గుడిలో ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్సై గంద్రాతి సతీశ్ దాతల సహకారంతో సుమారు రూ. 2 లక్షలతో ఇల్లు నిర్మించి ఇచ్చాడు. ఆదివారం ఆ ఇంటిని ఎస్పీ ప్రారంభించి ఆవరణలో మొక్క నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వడం సంతోషకరమన్నారు. ఓ వైపు పోలీస్ విధులు నిర్వర్తిస్తూ మరో వైపు సమాజ సేవా కార్యక్రమాలు చేయడంపై ఎస్సైని అభినందించారు. ఎస్సై సతీశ్‌కు రివార్డుతోపాటు మంచి పోస్టు ఇస్తామని పేర్కొన్నారు. జిల్లా నుంచి అధికంగా గంజాయి రవాణా జరుగుతున్నదని, నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చాలని, గుడుంబా నివారణకు యువత సహకరించాలని, గుడుంబా, బెల్లం అమ్మితే రూ.2లక్షల వ్యక్తిగత పూచికత్తు, బైండోవర్‌తో పాటు అవసరమైతే పీడీ యాక్టు సమోదు చేస్తామన్నారు. యువతకు పోలీస్ శిక్షణతోపాటు క్రీడోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా ఇంటి నిర్మాణానికి సహకరించిన దాతలు, ఎస్సై, సిబ్బందిని ఎస్పీ సన్మానించారు. వారికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. డీఎస్పీ సురేశ్, సీఐ సంజీవ్, ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది కృష్ణ, రమేశ్, యాకన్న ఉన్నారు.














